
# ఈ వారం కథ



## బెల్లడోనా - 20

రచన :ఎమ్మెస్సార్ మూర్తి

**రిసెప్షనిస్టుకి నేను రచయితనని ఎలా తెలిసిందో?!? రూమ్ కీ ఇచ్చి "ప్లీజ్ ఒక్క నిమిషం" అంటూ కౌంటర్ వెనక ఏదో వెతుకుతోంది.**

సన్నని ముక్కు, తెచ్చి పెట్టుకోని సహజమైన వర్చస్సు, మిలమిలా మెరిసే కళ్ళు... అతి సాధారణంగా వుండడం చూస్తే అసలా అమ్మాయి రిసెప్షనిస్టులా వుండదు. వయసు కూడా ఆట్టే వుండదు. ఇరవై మించదు. తనలా ఉండక పోవడం వల్లే ఆ హోటలు కూడా అంత హోమ్లీగా ఉన్న ట్టుంటుందేమో...

ఓ కవరు నా చేతికిస్తూ అంది "మీరేమను కోకపోతే... నేనో కథ వ్రాశాను. ఎలా వుందో చూసి చెప్తారా...? మీకు నచ్చితే..." అంటూ నవ్వి తలదించుకుంది.

మా దూరపు బంధువు లెవరో దీనిలో ఆదరంగా పలకరించి నట్టున్నాయి ఆ అమ్మాయి మాటలు ...

విస్మయం...

రూముకి వచ్చి డ్రెస్ మార్చుకుని కవరు

తీశాను. ఒకటే మడత నేసిన ఫుల్‌స్కేప్ కాగితాల్లో చక్కటి అక్షరాలు.

కథకి శీర్షిక లేదు.

కథ చదివాను. ఈ పేరు నేనే పెట్టాను. యధాతథంగా మీరూ చదవాలని...

*　　*　　*

తుంపర్ల వాన. ఆకాశమంతా మేఘాలతో నల్లటి కప్పు. రిట్జ్ నుంచి అలాంటి సమయాలలో హుస్సేన్ సాగర్ చూడాలి!

వెచ్చటి ఆహ్లాదమైన ఊహలు!

మ్యా ఎం.ఎల్.ఎ. క్వార్టర్సులోని సంపు దగ్గర వాటర్ పంపు తుమ్మెదల గుంపులాగా శబ్దం చేస్తోంది. రిట్జ్ కిచెన్‌లోంచి ఆమ్లెట్స్ గుబాళింపులు... ఆలోచనల్లోనే పెప్పర్... సాల్ట్‌తో ముక్కలు రుచి చూస్తున్న మనసు నాలుక మీద నీళ్ళు తెప్పిస్తోంది.

ఉన్నట్టుండి జాకెట్ బిగుతుగా ఉన్నట్టని పించింది.

దూరంగా "ఆనీ" కాఫీ సిప్ చేస్తున్నాడు.

"మీరూ కాఫీ తెచ్చుకోండి" అన్నాడు.

వేడి కాఫీ తగిలినంత చురుక్కుమంది నాలుక — ఇలా నైట్ డ్యూటీ చేశాక సెక్రెటేరియట్ వద్ద బస్ ఎక్కేందాకా రిట్జ్ మత్తు వదలదు. అలాగని అంత ఖరీదయిన కాఫీ త్రాగాల్సినంత మత్తు రిట్జ్‌లోనూ లేదు.

మత్తు 'ఆనీ'లో వుంది.

స్విమ్మింగ్‌పూల్‌కి చాలా మంది వస్తారు.

ఆడవాళ్ళు కూడా వస్తారు. ఆనీ రాకపోతే నాకదో రకంగా... బెంగగా వుంటుంది.

ఆ రోజు డ్యూటీ దిగినట్లే వుండదు. బస్ ఎక్కినట్లుండదు. స్నానం చేసినట్టు అన బుండదు, — ఆనీ ఎర్రగా వుంటాడు. స్విమ్ చేసి మరీ కందిపోతాడు, పూల్ బయటికి వచ్చి రాగానే ... ఒంటి నిండా నీళ్ళతో... మరీ మూడ ముద్దొస్తుంటాడు. నా వర్కింగ్ టేబిల్ దగ్గర్నుండి స్విమ్మింగ్‌పూల్ కనపడడం కాదు గానీ... కావాలనుకుంటే ఆనీను అంత దగ్గరగానూ చూపినట్టే వుంటుంది. ఆ మధ్య లయన్స్ క్లబ్ వారు పెట్టిన పోటీలో ఆనీ ఫస్ట్ వచ్చాడట. అప్పటినుంచే ఆనీతో హస్కు కొట్టాలనుకునే ఆ సికింద్రాబాద్ పోరికింకా పురిటి వాసన పోయిందా?! అని నా అనుమానం.

గడ్డం క్రింద నొక్కు.

అక్కడ... ఆ గుండెల మీద వుండే వెంట్రుకల్ని జుత్తు అంటారా? అనరు గదా... ఆ వెంట్రుకలు అలా దట్టంగా లేకపోతే అదృష్ట వంతులని ఊర్మిళ చెప్పింది. ఆడవాళ్ళు అదృష్ట వంతులు కావాలంటే ఎక్కడ జుత్తు తక్కువగా ఉండాలో మరి ఎవరూ చెప్పలేదు.

నేను అడగలేదు గదా!

చెవుల్లోని తడిని టవలుతోనూ వేళ్ళతోనూ తుడుచుకుంటూ తల విదిలించేటప్పుడు ఆనీను చూసి తీరాలి! తన చెవుల్లో వేళ్ళు తనకే చక్కిలిగిలి అయితే ఎలాగబ్బా!

ఆనీ వయసు ఎంతో వుండదు. కాలి

> 'యవనవ్వసనం' తన సహజోత్సాహంతో ఆసక్తితో ప్రపంచాన్ని పరిశీలిస్తూ వుంటుంది. ఆ దశలో యువతికి యువకుడూ, యువకునికి యువతీ అదీ నచ్చిన వాళ్ళు తటస్థపడితే ... తన కళ్ళు వెతుకుతున్న 'రూపం' అదేననిపిస్తుంది. ఆ 'మాయ'ను గ్రహించే అవకాశం అవతలి వాళ్ళు ఇస్తే, ఆ కళ్ళు అప్పుడు స్పష్టంగా చూస్తాయి. తనెంత 'ఫూల్' అయి పోయిందీ అర్థమవుతుంది.
>
> అస్పష్టత తొలగిన తర్వాత పసిపాప అంత స్వచ్ఛంగా బయటపడగలుగు తారప్పుడు.

పిక్కలు పోత పోసినట్లుంటాయి. వాటిని కాఫ్ మజిల్స్ అంటారని కరుణాకరన్ చెప్పాడు. కరుణాకరన్‌కి కరాటే పిచ్చి. డిష్ వాషింగ్ చేసే కరుణాకరన్ కరాటేతో ఏమి సాధిద్దామనో!

ఆనీకి పెళ్ళి... అయి... ఉండదు.

మనుదెప్పుడూ మడత పడనే పడదు.

ఆనీకి ఆర్థిక బాధలనలుండే వుండవు గాక వుండవు.

ఎప్పుడూ ఎదురుగా వుండేవాళ్ళ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ మాట్లాడతాడు.

మళ్ళీ మామూలు పాంటూ, షర్టూ వేసుకుని అదిదాస్ స్విమ్మింగ్ కిట్‌ని సైకిలుకి తగిలించుకుని ఝుమ్మంటూ వెళ్తాడు.

ఆనీకి కారు లేదు. కాని ఆనీకి కారు డ్రైవింగ్ వచ్చు. ఐమీన్ వచ్చే వుండాలి!

ఆనీ స్మోక్ చెయ్యడు. ఛార్మ్స్ సిగరెట్స్ కోసం ఆనీని మోడల్‌గా తీసుకుని ఓ మారుతీ కారుని వాళ్ళు ఎందుకు ప్రెజెంట్ చేయకూడదు?

డబ్బింగ్ సినిమాలోని హీరోకి వాయిస్ ఇచ్చినతను నిజంగా తనే హీరో అయితే అందు బాట్లో వుంటాడా?

"హల్లో ఆనీ..." నేనన్నన్నాకపోయినా అత నన్నవ్వుతాడు.

"హాయ్..." అతని తీరంతే.

"నేను త్వరలో వెళ్ళిపోతున్నాను"

"ఎక్కడికి?"

నాలుక్కరుచుకుని అటూ ఇటూ చూశాను.

రహస్యం అన్నట్టు దగ్గరగా పిలిచాను.

చెవి వంచమన్నాను.

మళ్ళీ ఓసారి చెవిలో వేలు పెట్టి తుడుచుకుని మరీ తలవంచాడు, చెప్పమన్నట్టు.

"కృష్ణా ఒబెరాయ్‌లో ఆఫర్ వచ్చింది" అంటూ అబద్ధం చెప్పాను.

అసలు నేను ఆ రోజు చెప్పాలనుకున్న నిజం "ఐ లవ్యూ" అని.

"కంగ్రాట్స్" అన్నాడు.

నా తల పట్టుకుని కుదపడు. బుగ్గలు ఓ వేల్తోనైనా నొక్కడు. భుజాల మీదుగా చేయి వేసి హత్తుకోడు.

మరోసారి "కంగ్రాట్స్" అంటూ వెక్కిరిస్తున్నట్లు ముక్కు చిట్లించి "గుడ్‌లక్" అన్నాడు,

"నిజా?" అన్నాను కోపంగా,

"యా"

"ఎందుకూ?" నన్నేడిపిస్తున్నాడని తెలుస్తూనే వుంది.

"ఒబెరాయ్‌లో స్విమ్మింగ్‌పూల్ వుంటే అక్కడికే వస్తాను"

నిజం- అని ఆశ్చర్యపోలేదు నేను. అందుకే గాబోసు అన్నాడు వెంటనే,

"ఇదెప్పట్నుంచీ-?"

"ఏవిటి?" నొసలు చిట్లించాను,

"అబద్ధం చెప్పడం."

గతుక్కుమనిపించింది నాకు,

"నిజం చెప్పనా?" అన్నాను. అసలు నిజంగా చెప్దామనే వుంది రోజు.

"యూ డోనా.. మళ్ళీ అబద్ధం కోసం ఆలోచిస్తున్నావు"

"లేదు.. నువ్వెంత గొప్ప స్విమ్మర్ వంటే.."

"ఫూలిష్.. ఈ రోజు నేను నీకో నిజం చెప్పాలి. కమ్.." అంటూ చెయి పట్టుకు లాగాడు..

నవ్వొస్తే తీసుకున్నట్టే వుంది.

"సీరియస్‌గా ఇపుడు నీకో నిజం చెప్పాలి"

"ఏమిటి?"

"నేను గొప్ప స్విమ్మర్ని!" మిలమిలా మెరుస్తున్న కళ్ళతో గర్వంగా అన్నాడు ఆనీ.

"అదేగదా నేనూ అనేది.." అన్నాను నవ్వుతూ

"నువ్వు ఎంతో అందమైన డోనావి"

నేను సిగ్గుపడ్డానో.. కళ్ళు మూసుకున్నానో..

"అటు చూడు."

హాసేన్ సాగర్ని చూశాను,

"ఇటు" చెయి చాచి చూపించాడు.

స్విమ్మింగ్‌పూల్.

"అంతే! నేను గొప్ప స్విమ్మర్ని కావడానికి కారణం కేవలం అంతా నా గొప్పతనమే కాదు, ఆ నీళ్ళు.. ఆ అలలు.. ఆ లోతులు.. ఆ వైశాల్యం.. ఆ నీళ్ళ మార్దవం.. ఆ నీళ్ళ లాలింపు.."

"ఏమిటి?"

"నేను స్విమ్మర్ని కావడానికి నీళ్ళ గొప్పతనం తప్ప ఇంకేం వుంది?" నవ్వుగా నవ్వాడు.

దూరంగా కనిపిస్తున్న నీళ్ళవైపు దృష్టి సారించాను. నీలితెరలు పరచినట్టున్న హాసేన్‌సాగర్.

ఇటువైపు నీలి తివాచీలా స్విమ్మింగ్‌పూల్..

అంత చలిలోనూ దప్పిక అయింది.

ఆనీ నావేపు తృప్తిగా చూస్తున్నాడు.

"నేను ఇంత గొప్పగా ఈదడానికి కారణం నీళ్ళకున్న సహజ లక్షణమేనని చెప్పడంలో ఇంకొంచెం లోతుంది."

ఏమిటన్నట్టు చూశాను.

" నీ, నా వయసులో వున్న వాళ్ళందరూ ఎంతో అందంగా కన్పించడం.. ప్రేమించాలనుకోవడం.. ప్రేమించడం.. నీళ్ళలాంటి మన వయసుకున్న సహజమైన.." ఆగాడు.

"చెప్పు" అన్నాను.

"నువ్వు ఎవరినైనా ప్రేమించడం.. కేవలం ఎదుటివాళ్ళ అందం, గొప్పతనం చూసే కాదు..

ప్రేమించాలన్న నీ.. సహజమైన.."

నాకు కొంచెం అర్థమయినట్లే వుంది. 'ఇంకా' అన్నట్టు తల ఊపాను.

"పర్ఫ్ కావడంలో నిషేధం ఎంత వుందో.. ఫార్మ్స్ సిగరెట్ త్రాగడంలో స్పిరిట్ ఆఫ్ ఫ్రీడమ్ ఎంత వుందో.."

నాకు నవ్వొచ్చింది.

"వయసులో వున్నవాళ్ళు ప్రేమించుకోవడంలోనూ అంతే ప్రేమ వుంది. ఆ ప్రేమ తర్వాత.. జీవితం వుంటుంది. ప్రేమించుకోవడం అందం, లవ్లీ.. బ్యూటీఫుల్.. కాదనను. ప్రేమకున్నూడా లోతుంది. ఆ లోతుల్లోని పారవశ్యమే జీవితం. కలిసి వుండడం, అంటే.. నువ్వు జీవితాన్ని నిజంగా ప్రేమించగలిగినపుడు. ఎవర్ని ఎలా ఎందుకు ప్రేమించాలో.. నీళ్ళలో

> ప్రేమించుకోవడం అందం ... లవ్లీ ... బ్యూటీఫుల్ ... కాదనను. ప్రేమకున్నూడా లోతుంది. ఆ లోతుల్లోని పారవశ్యమే జీవితం. కలిసి వుండడం అంటే, నువ్వు జీవితాన్ని నిజంగా ప్రేమించగలిగినప్పుడు, ఎవర్ని ఎలా ఎందుకు ప్రేమించాలో నీళ్ళలో ఈదినంత ఈజీగా అర్థమవుతుంది. లేకపోతే ... బుడుంగున మునగాల్సి వస్తుంది.

ఈదినంత ఈజీగా అర్థమౌతుంది. లేకపోతే.. జీవితంలో బుడుంగున మునగాల్సి వస్తుంది. అదుగో.. ఆ స్విమ్మింగ్ డ్రెస్‌లో వస్తున్న మనిషిని చూడు.. అంత వయసులో ఆవిడ ఈదుతుంటే మా ఊళ్ళో పక్కింటి రత్నబాయి తొడల వరకూ చీరను పైకిలాగి, ఆ కాళ్ళమీద పంటాడ్ని పడుకోబెట్టి- ఉగ్గు తాగించడం గుర్తుకొస్తుంది నాకు"

ఎవరో కేక వేశారు, "వస్తానిప్పుడే.." అంటూ. . .

ఆనీ వెళ్ళిపోయాడు.

వెళ్తున్న ఆనీను చూశాను.

ఇంతక్రితమే అతను చెప్పిన మాటలు గింగురుమంటున్నాయి.

నా కాళ్ళు రెండూ ఓ చేత్తో పట్టుకుని తల క్రిందులుగా హాసేన్ సాగర్‌లోనో.. స్విమ్మింగ్ పూల్‌లోనో ముంచి పైకి తీసినట్లనిపించింది.. కాదు..

నాకు తెలియని జీవిత సత్యాలలో ముంచి తేల్చినట్లనిపించింది.

నేను నేలమీదే వున్నట్లనిపించింది.

** ** **

ఆ క్షణాన్నుంచి నేను ఆనీని ప్రేమించలేదు.. మరీ నిక్కచ్చిగా చెప్పాలంటే ఇదివరకటిలాగా ప్రేమించలేదు. ఇంకెవర్నయినా అలా ప్రేమించాలని అనిపించలేదు.

అన్నింటిలోనూ.. అందరిలోనూ ప్రతిబింబిస్తున్న నా ప్రేమనే చూసుకుంటున్నాను.

ఈ నా తెలివిలో.. వెర్రుల్లో.. ఆశ.. అశ్లీలం.. గిల్టీ.. అమాయ.. ఆవేశం.. మత్తు.. ఇవేమీ లేవు.

కోరికలు ప్రకృతి చేసే లాలన అని తెలుసుకుని అన్నింటిలోనూ, అందరిలోనూ అనే ప్రకృతి చేస్తున్న రోదను వింటుంటే నవ్వొస్తోంది. ఒక్కోసారి భయమేస్తుంది. మరోసారి జాలేస్తుంది.

ప్చ్..

నా స్పందనలోని నిజం నాకు తెలిసాక..

ఇదివరకటి కంటే హాయిగా వుండి..

ఆనీని అలా ఎలా చూడగలిగానో..

ఊహించగలిగానో అర్థమై...

అసహ్యంగా లేదు గానీ....

మరీ సెల్ఫ్ పిటీ కాదు గానీ...

'పిచ్చి పిల్లా' అని నన్ను నేను అనుకుంటూ అర్థం చేసుకుంటుంటే.... నా ప్రతిరూపం అచ్చు నాలాగే ఉండి... 'దట్సిట్.... బి యువర్ సెల్ఫ్" అన్నట్టుగా ఉంది.

ఇదివరకటి నా చూపు వేరు ఇప్పటి పరిశీలన వేరు.

సి.ఎ.బి.ఎక్స్. బోర్డు...

గుండుమూది...

బిర్లా టెంపుల్ గడియారం...

మా దొడ్లోని ఆ చిన్న కరివేపాకు మొక్క.

నే నడుకునే పక్క...

ఇవీ... సిటున్నింటినీ... నేనిదివరకే సరిగా చూడలేదేమిటని పిస్తుంది.

* * *

"హల్లో ఆనీ..." ఇదివరకటి నా పలకరింపుకూ ఇప్పటి పలకరింపుకూ ఉన్న తేడాని ఏమనాలో తెలియడం లేదు. నాలోని ఈ మార్పుని నాకు వచ్చిన 'జ్ఞానం' అంటే మరీ బుక్కిష్‌గా ఉంటుందేమో! 'బుద్ధి' అంటే మరీ పిల్లిగా ఉంటుందేమో!

నీళ్ళంత ఉత్సాహంగా అలలంత హాయిగా

ఉండే ఆపో ఈ రోజెందుకో దిగాలుగా ఉన్నాడు.

అదే అడిగాను.

"ఇంటి దగ్గర్నుండీ ... ఐ మీన్ ... మా ఆవిడ దగ్గర్నుండీ ఉత్తరం రాలేదు..."

ఇదివరకైతే షాక్ తిని ఉండేదాన్ని; ఇప్పుడు ఆపోలోని అందం హాయిగా పెల్లి చేసుకుంది గామోసన్న ఆలోచనే!

"అన్నట్టు మీరెక్కడ వర్క్ చేస్తుంటారు?"

ఇంతవరకూ తనే ఉద్యోగం చేస్తుందీ నాకు తెలీదు.

"ఎయిర్ ఇండియాలో"

"గ్రేట్- ఐత్ మహారాజా" అన్నాను నవ్వుతూ.

"కానీ ఏం చేస్తున్నదీ మీరింకా విన్లేదు- అక్కడ నేను ఎటెండర్‌గా పనిచేస్తున్నాను"

ఇదివరకైతే చప్పరించి ఉండేదాన్ని. ఇప్పుడు ఆపోలో మరో సౌందర్యం.... నిజాయితీ ..... హంబుల్‌నెస్....

మళ్ళీ నరధ్యానంగా ఉన్న ఆపోని చూసి నాకు తెలియని వాళ్లావిడ గుర్తుకొచ్చి అనునయంగా అన్నాను "మీ ఆవిడ దగ్గర్నుండి రేపు తప్పకుండా ఉత్తరం వస్తుంది.. డోంట్ వర్రీ"

"థాంక్యూ" అని .... "ఈపాటికి ఏదో న్యూస్ రావలసింది. ఇ.డి.డి. మొన్న..."

"ఇ.డి.డి.? ... ఎక్స్‌పెక్టెడ్ డేట్?"

అవునన్నట్టు తల ఊపాడు.

"కంగ్రాట్యులేషన్స్. మీకు బాబు కావాలా పాప కావాలా?" అడిగాను మరింత ఉడికించాలని.

"యువర్ బెస్ట్ విషెస్" చిరునవ్వుతో కళ్ళు మూసుకుని కదిలి వెళ్లిపోయాడు.

మర్నాడు కనిపిస్తూనే "న్యూస్" అన్నాడు.

నేను ఉత్సాహంగా కంగ్రాట్స్ చెప్పాను.

"పాప...! మంచి పేరేదైనా చెప్పండి.... ఐ మీన్ సజెస్ట్ చెయ్యండి...." అన్నాడు మరింత ఉత్సాహంగా.

నా హాండ్ బాగ్‌లోంచి ఆ చిన్న బాటిల్ తీసి ఇచ్చాను.

"ఏమిటి?... ఏమిటి హోమియో మందు?"

ఆ చిన్ని సీసాను మతారంగా చేతిలోకి తీసుకుంటూ పసిపాపను చేతుల్లో ఎత్తుకుంటున్నంత కంగారుపడ్డాడు.

"అవసరమైనప్పుడు అనవసరంగా కంగారు పడకుండా మీ ఇంట్లో ఉంచమని నా గిఫ్ట్‌గా ఇస్తున్నాను" అన్నాను.

"మీకు హోమియో వైద్యం వచ్చా?" కళ్ళింతని చేసి అడిగాడు.

"రాదు. నేను మీ పాపలాగే పసిదాన్నిగా ఉన్నప్పుడు జ్వరమేదో వస్తే ఈ మందుతోనే బ్రతికానట! అందుకే నాకు ఈ మందు పేరే పెట్టారు" అన్నాను నవ్వుతూ.

"డోనా...." అని సాలోచనగా నన్ను చూసి సీసా మీది పేరును నవ్వుతూ చదివాడు.

"బెల్లడోనా 20"

• • •

తన పేరు లాగే కథ నాకెంతో బాగుంది.

లాటిన్ క్లాసిక్ లాంటి కథ వ్రాసిన ఈ అమ్మాయికి తన పేరు కూడా లాటిన్ భాషదేనని, ఆ పేరుకి అర్థం "మంచి అమ్మాయి" అని తెలుసో లేదో తనని అడిగితే బాగుండదు. తనంత తానుగా తెలుసుకుంటేనే థ్రిల్. ●


FIBROFLEX

• పరుపులు
• దిండ్లు
• కుషన్లు

IS : 8391

ISI

ఒక నూతన జీవనశైలికి మార్గదర్శి

ఒక జీవితపర్యంతపు పరుపు

శరీర సౌఖ్యానికి సాటిలేనిది



మృదువైనది ♦ సుఖమైనది ♦ నాణ్యమైనది

తయారుచేయువారు :
భారత్ మోటార్స్
151, మౌంట్ రోడ్డు
మద్రాసు 600 002
ఫోను : 865512, 861923
గ్రాములు : FIBROFLEX
టెలెక్స్ : 041-6136-BM-IN

బ్రాంచి ఆఫీసు :
26-3-64,
నాగేశ్వరరావు పంతులు రోడ్డు
గాంధీ నగరం
విజయవాడ 520 003

ఆంధ్రప్రదేశ్‌కు పంపిణీదార్లు :
ది సెంచరీ ట్రేడింగ్ కంపెనీ
26-22-25, ముదునూరువారి వీధి
గాంధీ నగరం
విజయవాడ 520 003
ఫోను : 74261

EXELADS/BM 669/90 (Tel)